238) సాళంగనాట

ప॥ సింగారాల మించీ నరసింహదేవుడు। చెంగట నున్నాడు నరసింహదేవుడు॥

చ॥ సురలు జయ వెట్ట నసురలెల్ల మొరవెట్ట। సిరితో మెలగీ నరసింహదేవుడు।
ధరణి వంపెట్ట బ్రతిధ్వనులు మిన్నులు ముట్ట। శిరసెత్తె నలి నరసింహదేవుడు॥

చ॥ కాంచనదైత్యుడు దొరకాలువనెత్తురు వార। చించెను గోళ్ళ నరసింహదేవుడు।
పంచల బంతాలు మీరి భవనాళియేరు వార। చెంచతల గోరీ నరసింహదేవుడు॥

చ॥ బలిమి పైపై నెక్క ప్రహ్లాదు డట్టె మొక్క। చిలికీ గరుణ నరసింహదేవుడు।
అలరి శ్రీవేంకటాద్రి నహోబలముమీద। చెలువమే చూపీ నరసింహదేవుడు॥